ఆగని ఆక్రమణలు..!



చెరువు గర్భంలో నిర్మాణానికి పిల్లర్స్ వేసిన దృశ్యం

- చిక్కిపోతున్న జోగి చెరువు గర్భం
- చోద్యం చూస్తున్న రెవెన్యూ యంత్రాంగం
- సర్వత్రా విమర్శల వెల్లువ

నరసన్నపేట: నియోజకవర్గ కేంద్రం నరసన్నపేటలో చెరువుల ఆక్రమణలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. స్థలం ఎక్కడ ఉందనేది చూడడం, తర్వాత గోతులు తవ్వడం, అనంతరం పిల్లర్స్ వేసి నిర్మాణాలు చేపట్టడం ఆనవాయితీగా మారింది. పంచాయతీ అధికారులు కొంతవరకు అడ్డుకుంటున్నా, చెరువులను కాపాడాల్సిన రెవెన్యూ యంత్రాంగం మాత్రం చోద్యం చూస్తోంది. ఫలితంగా చెరువులు చిక్కిపోతున్నాయి. స్థానిక గరీబ్ గైడ్ అనే స్వచ్ఛంద సంస్థ నరసన్నపేటలోని రాజుల చెరువు, శర్మాల చెరువు,రాతికర్ర చెరువుల్లో ఆక్రమణలపై న్యాయపరంగా పోరాడుతోంది. దీంతో ఇప్పుడు శివనగర్ కాలనీలోని జోగి చెరువుపై ఆక్రమణదారులు కన్ను వేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చెరువుల ఆక్రమణలు పెరుగుతున్నాయనే విమర్శలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు బరి తెగించి ఆక్రమణలకు పాల్పడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

జోగి చెరువుపై కన్ను

తాజాగా స్థానిక శివనగర్ కాలనీలో బొరిగివలస రెవెన్యూ పరిధిలోని గ్రామ కంఠం సర్వే నంబర్ 18లో ఉన్న జోగి చెరువుపై టీడీపీ ఆక్రమణలదారుల కన్ను పడింది. దీంతో చెరువు గర్భాన్ని ఆక్రమించుకొని నిర్మాణాలు చేపడుతున్నారు. రూ.లక్షలు విలువ కలిగిన ఈ చెరువును అప్పనంగా ఆక్రమించుకోవడానికి చూస్తున్నారు. వారం క్రితం ఒకరు చెరువు గర్భంలో ఇల్లు కట్టడానికి గోతులు తీయగా పంచాయతీ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో నాలుగు రోజులు ఎటువంటి పనులు చేపట్టలేదు. అయితే మంగళవారం మళ్లీ గోతుల్లో పిల్లర్స్ పనులు ప్రారంభించారు. కాగా చెరువును కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తనట్లు ఉండిపోగా, పంచాయతీ సిబ్బంది వెళ్లి పనులను అడ్డుకున్నారు. అయితే స్థానిక టీడీపీ నాయకులు తమకు కట్టుకోమని చెప్పారని, అందుకే నిర్మాణాలు చేపడుతున్నామని ఆక్రమణదారులు చెప్పినట్లు తెలుస్తోంది.

కఠిన చర్యలు తప్పవు

జోగి చెరువులో ఆక్రమ నిర్మాణంపై ఈవో ద్రాక్షాయిణి వెంటనే స్పందించారు. నిర్మాణ స్థలాన్ని మంగళవారం తన సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. చెరువు గర్భంలో ఎందుకు నిర్మాణాలు చేపడుతున్నారని ప్రశ్నించారు. ఏమైనా ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. అయితే వారు ఏమీ లేవని చెప్పడంతో పనులు నిలిపివేయాలని స్పష్టం చేశారు. మరోసారి మళ్లీ నిర్మాణాలకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఆక్రమణదారులతో మాట్లాడుతున్న అధికారులు

కార్మిక చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి వాణి

నరసన్నపేట: కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని స్థానిక కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో న్యాయవిజ్ఞాన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్మికుల హక్కులకు ఎవరైనా విఘాతం కలిగిస్తే తెలియజేయాలని సూచించారు. కార్మికులంతా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కార్మికులకు న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని, దీనికోసం ముందుగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ జయశంకర్, ఎంఎంఎస్ అధ్యక్షురాలు కల్పన, న్యాయవాదులు రావాడ కొండలరావు, రాజశేఖర్, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కళలను ప్రోత్సహించండి



కళాకారులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న దృశ్యం

ఆమదాలవలస: ప్రజలంతా కళాకారులను ప్రోత్సహించి, కళలను ఆదరించాలని తేనె తెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు అంజన్నప్ప అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ దరిలోని ఒక ప్రైవేటు గృహంలో కళాకారులను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంజన్నప్ప మాట్లాడుతూ మట్టిలో మాణిక్యాలు లాంటి కళాకారులను ప్రోత్సహిస్తూ ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల్లో ఉన్న కళాకారులను ప్రపంచానికి పరిచయం చేయాలన్న సదుద్దేశంతో కళాభిషేకం కార్యక్రమం ఆమదాలవలసలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ రంగస్థల నటుడు, హార్మోనిస్ట్ బెజ్జవరపు హరిబాబు, అరటిగట్ల హరిబాబు, సీనియర్ నటులు టేకి వీరభద్రాచారి, టేకి విశ్వేశ్వరరావు, బి.షణ్ముఖరావు, పెద్దింటి మోహన్‌దాస్, డి.భానుమూర్తి, ఉగాది వెంకటరావు, దుర్గాప్రసాద్, కె.సూరన్నాయుడు, అప్పలనాయుడు, రంగస్థల నటులు రామారావు, చింతాడ గోవిందమ్మ, అన్నపూర్ణమ్మ తదితరులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కళాకారులకు ప్రభుత్వాలు, వివిధ సంస్థలు తగిన సహకారం అందించాలని కోరారు.

రాష్ట్రంలో అరాచక పాలన

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గోవిందరావు



మాట్లాడుతున్న గోవిందరావు

ఆమదాలవలస: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు అన్నారు. పట్టణంలోని ఆయన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ప్రజలను మభ్య పెట్టేందుకు కుటిల రాజకీయాలకు తెరతీస్తున్నారని దుయ్యబట్టారు. నెలల వ్యవధిలోనే కుంభ కోణాలకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయన్నారు. రాష్ట్రంలో బీసీలకు కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఇటీవల రూ.230 కోట్ల నిధులు దోచుకున్న ఘటన వెలుగులోకి వచ్చిందని మండిపడ్డారు.

జిల్లాలో వ్యవసాయ శాఖ మంత్రి ఉండి కూడా రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఉపాధి హామీ నిధులు దుర్వినియోగం చేస్తూ పంచాయతీ వ్యవస్థను నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో పార్టీ నాయకులు కోట వెంకటరామారావు, కోట జశ్వంత్, మొండేటి కూర్మారావు, గురుగబెల్లి శ్రీనివాసరావు, తమ్మినేని వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అవస్థలు

- అరకొరగా సాగునీరు



పూడికపోయిన పిల్ల కాలువ



ట్యాంక్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్క

సరుబుజ్జిలి: మండలంలోని దకరవలస వద్ద ఎత్తిపోతల పథకం ఉన్నా ప్రయోజనం సున్నా అన్నట్లుగా ఉంది. నిర్వహణలో లోపాలు వలన రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఈ పథకానికి కొత్తకోట పెద్ద చెరువు నుంచి సాగునీరు అందాలి. అయితే రిజర్వాయర్‌లో ఆక్రమణలతో పాటు ఏళ్ల తరబడి పూడిక పేరుకుపోయి మైదానాన్ని తలపిస్తోంది. రిజర్వాయర్ నుంచి సాగునీరు ప్రవహించాల్సిన పిల్ల కాలువ పూర్తిగా మూసుకుపోయింది. దీంతో ఎత్తిపోతల పథకానికి నీరు చేరడం కష్టమవుతోంది. అలాగే ఇక్కడ గుర్రపు డెక్క ఏళ్ల తరబడి తొలగించకపోవడం వలన ప్రతిఏటా రైతులు సాగునీటికి ఇక్కట్లు పడుతున్నారు. ప్రాజెక్ట్‌కు సంబంధించిన పైపులైన్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రాజెక్టు సామర్థ్యం తక్కువ కావడం వలన కొన్ని గ్రామాలకు సాగునీరు అందడం లేదు. దీనివలన ఖరీఫ్, రబీ వ్యవసాయకాలంలో ఇబ్బందులు వస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకునేవారే కరువు



కొత్తకోట రిజర్వాయర్ నుంచి ఎత్తిపోతల పథకానికి నీరు ప్రవహించకపోవడంతో ప్రతిఏటా సాగు నీటి కష్టాలు వస్తున్నాయి. వినతులు ఇచ్చినా పట్టించుకునేవారే కరువయ్యారు. నీరు ప్రవహించే కాలువ పూడికపోవడం వలన నీరు అందడం లేదు. అధికారులు రిజర్వాయర్‌ను పర్యవేక్షించాలి.

– టి.తులసీరావు,రైతు,సుభద్రాపురం

పరిశీలన చేస్తాం

ఎత్తిపోతల పథకాన్ని వెంటనే పరిశీలన చేస్తాం. మరమ్మతుల కోసం అధికారులకు నివేదికలు పంపిస్తాము. అనుమతులు వస్తే తక్షణమే పనులు ప్రారంభిస్తాము.

– శోభన్, జేఈ, ఇరిగేషన్ శాఖ

భక్తిశ్రద్ధలతో పూజలు



పూజలు నిర్వహిస్తున్న ధర్మాన కృష్ణదాస్, ప్రసాదరావు తదితరులు

నరసన్నపేట: మండలంలోని మాకివలసలో అసిరితల్లి అమ్మవారి సిరిమాను ఉత్సవంలో మాజీ మంత్రులు ధర్మాన కృష్ణదాస్, ధర్మాన ప్రసాదరావులు మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు అసిరితల్లి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు వీరికి స్వాగతం పలికారు. అలాగే గ్రామంలోని పలు ఇళ్లకు వెళ్లి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను కలిశారు. వీరితో పాటు నాయకులు ధర్మాన రామదాసు, యాళ్ల కృష్ణంనాయుడు, యాళ్ల అప్పలనాయుడు, యాళ్ల మోహనరావు, సర్పంచ్ మోహనరావు తదితరులు ఉన్నారు.

ఇళ్ల పనులు ప్రారంభించాలి



సమీక్ష నిర్వహిస్తున్న జెడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా

నరసన్నపేట: మండలంలోని 166 ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.50 వేలు చొప్పున ప్రోత్సాహకాలు లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసిందని, వీరందరూ విధిగా ఇళ్ల పనులు ప్రారంభించాలని జెడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా సూచించారు. గృహ నిర్మాణ శాఖ పనితీరుపై ఆయన మంగళవారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గృహ నిర్మాణ శాఖ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు బాధ్యతగా పనిచేయాలని, లబ్ధిదారులతో పనులు ప్రారంభింపజేయాలని సూచించారు. ఒకవేళ పనులు చేయకపోతే సంబంధిత ఇంజినీరింగ్ అసిస్టెంట్లదే బాధ్యత అన్నారు. పనులు చేసి బిల్లులు అప్‌లోడ్ చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో మధుసూదనరావు, గృహనిర్మాణ శాఖ ఏఈ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మోటార్లు బిగిస్తే చర్యలు

ఆమదాలవలస: పట్టణంలో మంచినీటిని సరఫరా చేస్తున్న కుళాయిలకు మోటార్లు బిగిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. పురపాలక సంఘంలో వేసవి కాలం దృష్ట్యా పట్టణ ప్రజలకు మంచినీటి సరఫరా పంపిణీలో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. పట్టణంలో నీటి ఎద్దడికి గల కారణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించగా వివిధ వార్డుల్లో ఇంటి యజమానులు ఇంటి కొళాయిలకు మోటార్లను బిగించి అక్రమంగా నీటిని నిల్వ చేయడం వలన, మిగతా కుటుంబాలకు మంచినీటి కొరత ఏర్పడుతున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. భవిష్యత్తులో అక్రమ మోటార్లతో నీటి కొరత సృష్టించినట్లయితే మున్సిపల్ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ముగిసిన చెవిటమ్మ తల్లి ఉత్సవాలు



ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని దబ్బపాడు గ్రామంలో మూడు రోజుల పాటు జరిగిన చెవిటమ్మ (సుమంతాపురం) తల్లి గ్రామ దేవత అమ్మవారి పండగలు మంగళవారంతో ముగిశాయి. సాయంత్రం మహిళలు ముర్రాటలు తీసుకుని వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి పండగల్లో భాగంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు కూడా తరలివచ్చి అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారని కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

కుట్టు మిషన్ల స్కామ్‌పై విచారణ చేపట్టండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నరసన్నపేట: బీసీలకు మేలు చేస్తున్నామని చెప్పి ప్రజాధనం దోచుకోవాలని ప్రభుత్వంలోని కొందరు నేతలు కుట్ర చేస్తున్నారని, కుట్టు మిషన్ల స్కామ్‌పై విచారణ జరగాలని బీసీ నాయకులు రాజాపు అప్పన్న, బీసీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జోల సాయి, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కేసీహెచ్‌బీ గుప్త, పోలాకి మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు ముద్దాడ బైరాగి నాయుడు, మండల బీసీ సెల్ నాయకుడు వాన గోవిందరావు కోరారు. ఈ మేరకు ఎంపీడీవో మధుసూదనరావు, తహసీల్దార్ సత్యనారాయణకు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. గతంలోనూ ఆదరణ పేరులో రూ.కోట్లు పక్కదారి మళ్లించారని గుర్తు చేశారు. మహిళలకు కుట్టు మిషన్లు ఇచ్చే ప్రక్రియలో టెండర్ల దశ నుంచే సక్రమంగా జరగడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో జలుమూరు ఎంపీపీ వాన గోపి, వైఎస్సార్‌సీపీ నాయకులు ధర్మాన జగన్, సురంగ నర్సింగరావు, బగ్గు రమణయ్య, కనపల శేఖరరావు, నేతింటి రాజేశ్వరరావు, బొబ్బాది ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించరా..?

- సర్వసభ్య సమావేశంలో సభ్యుల నిలదీత



సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

మెళియాపుట్టి: మూడు నెలలకు ఒకసారి జరిగే సాధారణ సర్వసభ్య సమావేశంలో సభ్యులు తెలియజేసిన సమస్యలు అధికారులు నోట్ చేసుకోవడం లేదనీ, అందువలన పరిష్కారానికి నోచుకోవడం లేదని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాణా ఈశ్వరమ్మ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మాట్లాడుతున్న సమయంలో పలు గ్రామాల్లో నీటి ఎద్దడి ఉందని పరిష్కరించాలని సభ్యులు కోరారు. ఏఈ బదులిస్తూ కేరాసింగి, గూడ, చందనగిరి, మూల ముకుందాపురం, సవర ముకుందాపురం, సవర సజ్జనాపురంలో తాగునీటి సమస్య ఉందని, అక్కడ తాగునీటి పథకాలు నిర్మించడానికి టెండర్లు వేయనున్నట్లు తెలిపారు. అయితే వసుంధర, హీరాపురం, మామిడిగుడ్డి గ్రామాలకు సైతం నీటి పథకాలు మంజూరు చేయాలని సభ్యులు కోరారు.

రహదారులు నిర్మించాలి

ఐటీడీఏ ఏఈ శ్రీకాంత్ మాట్లాడుతూ మండలంలో పలు రహదారుల నిర్మాణాల కోసం రూ.25 కోట్లకు అంచనాలు తయారుచేసి ప్రభుత్వానికి అందించామన్నారు. అయితే గిరిశిఖర గ్రామాలకు సైతం పూర్తిస్థాయిలో రహదారులు నిర్మించాలని సభ్యులు కోరారు. చీపురుపల్లి సర్పంచ్ ఈశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో అధికారులు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఎంపీపీ ఈశ్వరమ్మ మాట్లాడుతూ మండలంలో తాగునీరు, రహదారులు, మౌలిక సదుపాయాల కల్పనకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. ప్రోటోకాల్ తదితర సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా, వైస్ ఎంపీపీ ఆదినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆగని ఇసుక దందా

హిరమండలం: ఇటీవల వంశధార నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న 13 ట్రాక్టర్లను సీజ్ చేసిన తర్వాత కొద్ది రోజులపాటు ఆగిన ఇసుక దందా మళ్లీ ప్రారంభమైంది. గత నాలుగైదు రోజులుగా భగీరథీపురం సమీపంలోని వంశధార నదిలో ఇసుక అక్రమ దందా నడుపుతున్నారు. రెవెన్యూ, పోలీసుల హెచ్చరికలను పట్టించుకోకుండా అక్రమ రవాణా సాగిస్తున్నారు. మండలంలోని వంశధార నదిలో ఇసుక రీచ్ లేకపోయినా టెక్కలి, ఒడిస్సా, పాతపట్నం ప్రాంతాల నుంచి పదుల సంఖ్యల్లో ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా జరుపుతున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అక్రమ రవాణాను అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.



వంశధార నదిలో ట్రాక్టర్లకు ఇసుకను ఎత్తుతున్న దృశ్యం

తేలికపాటి జల్లులు



ఆకాశం మేఘావృతమైన దృశ్యం

ఎల్.ఎన్.పేట: మండలంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం తేలికపాటి జల్లులు కురిశాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ వేడిమికి ప్రజలు ఇబ్బంది పడ్డారు. సాయంత్రానికి వాతావరణం చల్లగా మారడంతో ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత టెక్కలి



ట్రోఫీతో కార్తీక్ లెవెన్ జట్టు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న రమేష్/శేఖర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా టెక్కలి కార్తీక్ లెవెన్ జట్టు నిలిచింది. ఫైనల్‌కు టెక్కలి కార్తీక్ లెవెన్, వానవానిపేట జట్లు చేరాయి. మంగళవారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. దీంట్లో ముందుగా బ్యాటింగ్ చేసిన వానవానిపేట నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 85 పరుగులు చేసింది. 86 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన టెక్కలి కార్తీక్ లెవెన్ జట్టు 9 ఓవర్లకు 5 వికెట్లు నష్టపోయి లక్ష్యాన్ని చేదించింది. 28 టీములు ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. టోర్నీ నిర్వహణలో నక్క రాము, భార్గవ్, శివాజీ, శ్రీను, జాంటీ, పాపారావు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యారోగ్య సిబ్బంది నిరసన



తాడివలస పీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న వైద్యారోగ్య సిబ్బంది

పొందూరు: మండలంలో కింతలి, తాడివలస పీహెచ్‌సీల పరిధిలోని వైద్యారోగ్య సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో మంగళవారం నిరసన తెలిపారు. ఆయా పీహెచ్‌సీల ఆవరణలో ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు, ఆశ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సకాలంలో వైద్య సేవలను అందిస్తున్న తమపై ఎంఎల్‌హెచ్‌సీలు అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు.

అకారణంగా తమపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంఎల్‌హెచ్‌పీలు తక్షణమే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

పక్కాగా ప్రత్యేక తరగతులు



విద్యార్థులతో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష అధికారులు

సారవకోట: కేజీబీవీల్లో పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు పక్కాగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సమగ్ర శిక్ష జీఎస్‌డీవో వెలమల ఉమ సూచించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు ఇస్తున్న శిక్షణా తరగతులను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని వివిధ కేజీబీవీల్లో 10వ తరగతి ఫెయిల్ అయినటువంటి విద్యార్థులు 137 మందిని ఈ కేంద్రానికి కేటాయించామన్నారు. అలాగే కోటబొమ్మాళి కేజీబీవీలో కూడా ఇటువంటి తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వీరంతా ఈనెల 19 నుంచి ప్రారంభమవ్వనున్న సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులు అయ్యేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆమెతో పాటు కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి ప్రభాకరరావు తదితరులు ఉన్నారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం



సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

హిరమండలం: నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయం డీపీఎం సత్యనారాయణ, మండల వ్యవసాయాధికారి బి.సంధ్య అన్నారు. మండలంలోని ఎంఎల్‌పురం గ్రామంలో నవధాన్యాల సాగుపై మంగళవారం అవగాహన కల్పించారు. వరి పంటలో నవధాన్యాల సాగుకు పీఎండీఎస్ 12 రకాల పంటలతో 2 కిలోల పరిమాణం కలిగిన కిట్స్ 200 తయారు చేయడం జరిగిందన్నారు. రైతులు ఈ కిట్స్‌ను తీసుకెళ్లి సాగు చేయాలని సూచించారు. నవధాన్యాల సాగు వలన ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ముసలయ్య, ఎంటీ సూర్యనారాయణ, యూనిట్ ఇన్‌చార్జి లత, ఐసీఆర్‌పీలు శ్రీను, డిల్లీ, జోగారావు, దమయంతి తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపు తొలగించాలి



మద్యం షాపు వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

పాతపట్నం: మండల కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన మద్యం షాపు వద్ద స్థానిక మహిళలు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనావాసాల మధ్య మద్యం దుకాణం నిర్వహించడం వలన తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. జనావాసాలకు దూరంగా షాపు మార్చాలని ధర్నా చేపట్టారు.

శ్మశానానికి స్థలం సమకూర్చండి



ఎమ్మెల్యే రమణమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

నరసన్నపేట: మండలంలోని జమ్ము పంచాయతీ పరిధిలో కొత్తగా గత ప్రభుత్వ కాలంలో నిర్మించుకున్న కాలనీకి శ్మశానానికి స్థలం కేటాయించాలని కాలనీ ప్రజలు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి వినతిపత్రం మంగళవారం అందజేశారు. కాలనీలో సుమారు మూడు వందల కుటుంబాలు నివసిస్తున్నాయని, అయితే మరణించినవారికి అంత్యక్రియలు నిర్వహించడానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అలాగే మంచినీరు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

పాతపట్నం: పేద కుటుంబాల నుంచి ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంఈవోలు ఎ.గోవిందరావు, సీహెచ్ తిరుమల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం పేద విద్యార్థులకు ప్రతి ప్రైవేటు విద్యాలయంలో 25 శాతం సీట్లను రిజర్వ్ చేసిందన్నారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే ముఖ్య ఉద్దేశమన్నారు. ఈనెల 20 వరకు ఆన్‌లైన్‌లో సచివాలయం, మీసేవ, ఇంటర్నెట్ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేయలేనివారు నేరుగా మండల విద్యాశాఖ అధికారి కార్యాలయానికి సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. మండలంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.